జల్సాల కోసం చోరీల బాట

- జైలులో కలిసి.. ముఠా కట్టి..
- అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు
- పట్టుబడిన నలుగురు
- వీరిలో ఇద్దరు ఉన్నత విద్యావంతులు
- రూ.7.74 లక్షల సొత్తు స్వాధీనం



నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును మీడియాకు చూపుతున్న డీఎస్పీ మాధవరెడ్డి, సీఐ కొండలరావు

అమలాపురం టౌన్: జైలు జీవితం ఆ నలుగురినీ స్నేహితులను చేసింది. అప్పటి వరకూ ఒక్కొక్కరుగా అనేక నేరాలకు పాల్పడి వారు.. శిక్షా కాలం ముగిశాక ముఠాగా ఏర్పడ్డారు. ఉమ్మడిగా చోరీలు మొదలు పెట్టారు. అటు హైదరాబాద్.. ఇటు మన రాష్ట్రంలోనూ అనేక చోరీలకు పాల్పడ్డారు. తీగ లాగితే డొంక కదిలినట్లు అమలాపురంలో గత ఏడాది అక్టోబర్‌లో చేసిన ఓ ఇంటి దొంగతనం దర్యాప్తులో ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టు రట్టయింది. పట్టణ పోలీసులు శుక్రవారం సాయంత్రం అమలాపురంలో ఈ ముఠాను పట్టుకున్నారు. ఈ వివరాలను డీఎస్పీ వై.మాధవరెడ్డి, పట్టణ సీఐ ఎస్‌సీహెచ్ కొండలరావు, ఎస్సై ప్రభాకర్ శనివారం ఉదయం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.

వారి కథనం ప్రకారం.. రాజమహేంద్రవరానికి చెందిన గొర్రెల చినబాబు, టేకుమూడి దుర్గాప్రసాద్, ఉప్పులూరి భాస్కర శివరాజు, ఒక బాలుడు ఈ ముఠాలో ఉన్నారు. ఈ నలుగురూ చెడు వ్యసనాలకు లోనై, ఇంటి దొంగతనాలను ఆదాయ మార్గంగా ఎంచుకున్నారు. అలా వస్తున్న డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. అనువైన ఇళ్లను ఎంపిక చేసుకుని, చోరీలకు పథకం వేస్తారు. ఈ ముఠాలోని చినబాబు బీటెక్ చదివి, మెడికల్ రిప్రజెంటేటివ్‌గా కూడా పని చేశాడు. ఉప్పులూరి భాస్కర శివరాజు దివ్యాంగుడు. ఇతడు ఎల్ఎల్‌బీ చదువుతున్నాడు. టేకుమూడి దుర్గాప్రసాద్ ఆటో డ్రైవర్. ఈ ముఠాలోని బాలుడికి కూడా అనేక నేరాలతో సంబంధాలున్నాయి. వీరిలో ఒక్కొక్కరిపై 5 నుంచి 15 చోరీ కేసుల వరకూ ఉన్నాయి. అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో 5, రాజోలులో 1, పెరవలి 1, ఏలూరు 1, నర్సీపట్నం 1, దువ్వాడ 2, విశాఖపట్నం మువ్వలవానిపాలెం 1, హైదరాబాద్ ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో 2 చొప్పున కేసులు ఈ ముఠాపై ఇప్పటికే నమోదయ్యాయి. వీరు పలు కేసులలో శిక్షలు కూడా అనుభవించారు. ఈ కేసులతో పాటు రాజానగరం, రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, పెద్దాపురం, రావులపాలెం, పి.గన్నవరం, కొత్తపేట, అనపర్తితో పాటు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు, తాడేపల్లిగూడెం పోలీసు స్టేషన్లలో కూడా ఈ ముఠాపై చోరీ కేసులు ఉన్నాయి. ఈ ముఠా నుంచి పోలీసులు 56.7 గ్రాముల బంగారు నగలు, 3.150 కేజీల వెండి వస్తువులు, రూ.20 వేల నగదు, రెండు మోటారు సైకిళ్లు, రూ.1.84 లక్షల విలువైన ఇతర సామగ్రి కలిపి మొత్తం రూ.7.74 లక్షల సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను శనివారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ముఠాను చాకచక్యంగా పట్టుకున్న సీఐ, ఎస్సై, సిబ్బంది, క్లూస్ టీములను జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

పెండింగ్ బకాయిలను చెల్లించాలి

ముమ్మిడివరం: రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ బకాలయిను వెంటనే చెల్లించి, రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతూ ముమ్మిడివరంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి సివిల్ సప్లయి ఆఫీస్ వరకూ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా సివిల్ సప్లయి అధికారి తులసికి వినతిపత్రం అందజేశారు. రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు చేస్తామని ఆమె హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నేటి నుంచి బీఎన్ఐ ఎక్స్‌పో

అమలాపురం టౌన్: అమలాపురంలో మొదటిసారిగా బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖ ఎక్స్‌పోను స్థానిక గంగరాజు ఫంక్షన్ హాలులో ఈనెల 22, 23, 24 తేదీల్లో ఏర్పాటు చేసింది. ఈ ఎక్స్‌పోలో లైఫ్ స్టయిల్, జ్యూయలరీ, గార్మెంట్స్, రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ తదితర పలు ఉత్పత్తుల స్టాల్స్‌తోపాటు ఫుడ్ కోర్టు కూడా ఏర్పాటు చేసినట్టు ఆ ఎక్స్‌పో నిర్వాహక సంస్థ తెలిపింది. ఉచిత ప్రవేశంతో నిర్వహిస్తున్న ఈ ఎక్స్‌పోకు కోనసీమ వ్యాప్తంగా అన్ని రకాల వ్యాపారులు, వినియోగదారులు, ప్రజలు రావాల్సిందిగా బీఎన్ఐ విజ్ఞప్తి చేసింది.

55 వేల మందికి టెన్త్ స్టడీ మెటీరియల్



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

పి.గన్నవరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రూ.1.2 కోట్ల వ్యయంతో 55 వేల మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నామని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. మండలంలోని 766 మంది పదో తరగతి విద్యార్థులకు ఆయన 'జగనన్న విద్యాభారతి' స్టడీ మెటీరియల్ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. పి.గన్నవరం జెడ్పీ హైస్కూలులో ఎంఈఓ కోన హెలీనా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వేణుగోపాలరావు మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ టీఎస్ వెంకటాచార్య, సర్పంచ్, ఎంపీటీసీ సమాఖ్యల అధ్యక్షులు తోలేటి బంగారునాయుడు, ఆదిమూలం సూరయ్యకాపు, ఎస్ఎంసీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఏనాడూ పోరాడని వ్యక్తి విమర్శలు చేయడమా

సూర్యనారాయణ వైఖరిపై ఏపీ ఎన్జీవో జిల్లా సంఘం ఆగ్రహం

కాకినాడ సిటీ: నిరంతరం ఉద్యోగుల ప్రయోజనాలు, హక్కుల సాధనకు పోరాడుతున్న తమ సంఘాన్ని ఏపీ జీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ విమర్శించడాన్ని ఏపీ ఎన్జీవో సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. కాకినాడలోని ఏపీ ఎన్జీవో భవన్‌లో జిల్లా కార్యవర్గం అత్యవసర సమావేశం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఇందులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. సూర్యనారాయణ అడ్డదారుల్లో రూసా రూల్స్‌కు విరుద్ధంగా సంఘానికి గుర్తింపు తెచ్చుకుని, ఉద్యోగుల సమస్యలపై పోరాడకుండా.. 70 ఏళ్ల చరిత్ర ఉన్న ఏపీ ఎన్జీవో సంఘాన్ని విమర్శించడం ఎంతవరకూ సమంజసమని నేతలు ప్రశ్నించారు. ఎన్జీవో సంఘం పూర్వ నేతలు సాధించిన కారుణ్య నియామకం జీవోలో ఉద్యోగం పొంది, ఆ ఫలాల్ని అనుభవిస్తూ అదే సంఘాన్ని విమర్శించడం ఆయన విజ్ఞతకే వదిలి పెడుతున్నామని పేర్కొన్నారు. ఏపీ ఎన్జీవో సంఘం అహర్నిశలూ ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణకు, హక్కుల సాధనకు పోరాడుతుందని చెప్పారు. ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవులు, జీపీఎఫ్ లోన్లు, కరువు భత్యం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని తమ సంఘం డిమాండ్ చేసిందన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, కోశాధికారి వై.పద్మమీనాక్షి, సహాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు సరెళ్ల చంద్రరావు, కేవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అత్యవసర సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎన్జీవో అసోసియేషన్ నేతలు

కాలభైరవుని ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



చొల్లంగిలో కాల భైరవస్వామిని దర్శించుకుంటున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్

కాట్రేనికోన: పల్లం పంచాయతీ బ్రహ్మసమేద్యంలో వెలసిన కాల భైరవ స్వామి ఆలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ అన్నారు. శనివారం చొల్లంగి తీర్థం వెళ్లి కాల భైరవస్వామిని, బ్రహ్మేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాల భైరవస్వామి ఆలయం 200 ఏళ్ల పైబడిన పురాతనమైన ఆలయమన్నారు. సంతానం లేని దంపతులు స్వామివారిని దర్శించుకుంటారన్నారు. సుమారు మూడు కోట్ల రూపాయలతో నూతన ఆలయ నిర్మాణ పనులు చేపట్టామని, ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం సముద్రం వరకూ రూ.75లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపట్టామని, భవిష్యత్‌లో విశ్రాంతి గదులు, మహిళలకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లాడి వీరబాబ్జి, జెడ్పీటీసీ నేల కిషోర్‌కుమార్, నాయకులు పాలిక ధర్మారావు, నడింపల్లి సూరిబాబు, నల్లా నరసింహమూర్తి, కోలాటి సత్యం, ముమ్మిడివరం ఎంపీపీ కోలా గంగాభవానీ తదితరులు ఉన్నారు. చొల్లంగి తీర్థం సందర్భంగా భక్తులు సముద్ర స్నానం ఆచరించి కాల భైరవస్వామిని దర్శించుకున్నారు. కాట్రేనికోన ఎస్సై టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సముద్ర తీరం, ఆలయ పరిసరాల్లో పికెటింగ్ ఏర్పాటు చేశారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు గొల్లవిల్లి విద్యార్థులు

ఉప్పలగుప్తం: కర్నూల్‌లో ఈ నెల 23వ తేదీ నుంచి జరిగే ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు గొల్లవిల్లి స్పోర్ట్స్ క్లబ్ చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఓలేటి సత్యవేణి, పాలకొల్లు ఉషారాణి, తిక్కిరెడ్డి కృపాకీర్తన, పోతుల పవన్‌కుమార్ ఇటీవల అనపర్తిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ గొలకోటి ఫణీంద్ర శనివారం తెలిపారు. ఈ విద్యార్థులను హెచ్ఎం లంకా రాణి, పీఎంసీ చైర్మన్ దోనిపాటి రమావెంకటకయణ, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం రాణి

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఫిర్యాదు

యానాం: యానాం-దరియాలతిప్ప రహదారిలోని దొమ్మేటిపేట దుర్గమ్మ గుడి వద్ద ఉన్న కల్వర్టు ప్రాంతంలో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు శనివారం ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కల్వర్టు నిర్మించారని, అది ఎత్తుగా ఉండడంతో కిందకు వాహనాలపై వేగంగా వస్తుండడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఉన్న రెండు స్పీడ్ బ్రేకర్లను తొలగించి, వాటిని పునర్నిర్మించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కోనసీమలో ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటుకు కృషి

అమలాపురం టౌన్: కోనసీమలో ప్రభుత్వ ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటుకు కృషి చేస్తున్నానని రాష్ట్ర దృశ్య కళల అకాడమి చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ అన్నారు. ఇప్పటికే ఈ అంశంపై తాను తమ అకాడమి ద్వారా సూచించిన ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందని వెల్లడించారు. అమలాపురం ఏలీమ్ ఒకేషనల్ కళాశాల ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న లైవ్ పెయింటింగ్ వర్క్‌షాపు శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం గ్యాలరీ ఏర్పాటు చేసి, కళను గుర్తించిన చిత్రకారుడు పీసీ ప్రసాద్‌ను సభా ముఖంగా సత్య శైలజ అభినందించి, సత్కరించారు. తర్వాత సత్య శైలజను పీసీ ప్రసాద్ ఆర్ట్ గ్యాలరీకి చెందిన చిత్రకారులు ఘనంగా సన్మానించారు.

సీఐటీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలో సీఐటీయూ కార్యకర్తల సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జొన్నాడ పద్మ, కార్యదర్శిగా జి.బేబిగంగా రత్నం, కోశాధికారులుగా కొంకి సుభాషిణి, పేరాబత్తుల మంగాదేవి, ఎం.బాలవేణి, పొలమూరి సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా సలాది ముత్యాలరావు, ఈకుల వీరబాబు, ఉందుర్తి అంజలరావులను ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

అమలాపురం రూరల్: అమలాపురంలో రవాణా శాఖ అధికారులు, పోలీసు అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. జిల్లా రవాణా అధికారి డి.అశోక్ ప్రతాపరావు, డీఎస్పీ వై.మాధవరెడ్డి, పట్టణ సీఐ ఎస్‌సీహెచ్ కొండలరావు, ఎంవీఐలు, ఎస్సైలు, పోలీసులు హెల్మెట్లు ధరించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ మోటారుసైకిల్ ర్యాలీ చేపట్టారు. నల్లవంతెన, ఎర్రవంతెన, ఎన్టీఆర్ మార్గ్, గడియారం స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు, హైస్కూలు సెంటరు మీదుగా ర్యాలీ సాగింది. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్లు, నాలుగు చక్రాల వాహన చోదకులు సీటు బెల్టులు విధిగా ధరించాలని నినాదాలు చేశారు. మద్యం సేవించి వాహనాల నడపొద్దని, అతి వేగం వద్దని, హెల్మెట్ ధరించి, ప్రాణాలు కాపాడుకోండి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. రవాణా, పోలీసు అధికారులు, సిబ్బంది, మోటారుసైకిళ్ల డీలర్లు పాల్గొన్నారు. ర్యాలీలో పట్టణ ఎస్సై ప్రభాకరరావు, ట్రాఫిక్ ఎస్సై రాజు తదితరులు పాల్గొని హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు.

చెరువు అభివృద్ధికి నిధులు

అమలాపురం టౌన్: పట్టణంలోని గరిగుంట చెరువు అభివృద్ధికి రూ.1.13 కోట్ల నిధులు శనివారం మంజూరయ్యాయి. అమృత్-2.0 పథకం కింద రాష్ట్రంలోని పలు చెరువులకు నిధులు మంజూరు చేసిన క్రమంలో గరిగుంట చెరువుకు నిధులు మంజూరయ్యాయి. డ్రైనేజీ సౌకర్యం లేక, గుర్రపు డెక్కతో చెరువు అస్తవ్యస్తంగా ఉంది. చెరువు చుట్టూ పక్కా డ్రైను, కాంపౌండ్ వాల్ నిర్మించనున్నట్టు మున్సిపల్ డీఈఈ కొత్త అప్పలరాజు శనివారం రాత్రి తెలిపారు.

విద్యార్థికి అభినందనలు

యానాం: నియోజక వర్గ పరిధిలోని శివారు తీర ప్రాంత మత్స్యకార గ్రామంలో ప్రభుత్వ స్కూల్‌లో చదువుకుని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ) సీటు సాధించిన విద్యార్థిని కోలా సాయి ప్రసన్నను పలువురు అభినందించారు. సాయి ప్రసన్న గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 2019-20లో చదువుకుని, అనంతరం ఇంటర్ విద్య పూర్తి చేసి, ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకు సాధించి ప్రతిష్టాత్మకమైన ఎన్ఐటీ కారైకల్‌లో సీటు సంపాదించింది. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దంగేటి త్రిమూర్తులు మాస్టారు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రసన్న తల్లిదండ్రులు కోలా హరికృష్ణ, వెంకటరమణలను సత్కరించారు. మారుమూల గ్రామమైన గిరియాంపేటలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉన్నత విద్యకు సీటు సాధించడం గ్రామంలోని మిగిలిన విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



తండ్రి వెంకటరమణకు సత్కరిస్తున్న మాస్టారు, పక్కనే సాయిప్రసన్న

క్లుప్తంగా

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సీఐ శివరామరాజు

అమలాపురం టౌన్: మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను పాడుచేసుకోవద్దని, డ్రగ్స్ రహిత సమాజాన్ని ఆవిష్కరించేందుకు విద్యార్థులు నడుం బిగించాలని అమలాపురం ఎస్ఈబీ సీఐ వేగిశ్న శివరామరాజు పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులతో శనివారం జరిగిన అవగాహన సదస్సులో సీఐ శివరామరాజు మాట్లాడారు. నేటి యువత మంచి మార్గంలో పయనించాలని, మత్తు పదార్థాలకు బానిస కావొద్దన్నారు. ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. డ్రగ్స్ సరఫరా చేసే వ్యక్తుల తారసపడ్డా, ఎవరైనా సేవిస్తున్నా తక్షణమే టోల్ ఫ్రీ నెంబర్‌ను తెలియజేయాలన్నారు. అవగాహన సదస్సులో ఎస్ఈబీ ఎస్సై స్వామి రెడ్డి కూడా మాట్లాడారు.

మహాలక్ష్మి అమ్మవారి జాతర

ఉప్పలగుప్తం: చల్లపల్లి గ్రామ దేవత మరిడి మహాలక్ష్మి అమ్మవారి జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. గరగ నృత్యాలతో గ్రామోత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జీతాలిప్పించండి

యానాం: గత ఐదు నెలలుగా జీతాలు ఇవ్వక ఇబ్బందులు పడుతున్నామని యానాం ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్ట్ అంబులెన్స్ డ్రైవర్లు పేర్కొన్నారు. దీనిపై శనివారం ఎల్జీ తమిళిసైసౌందరరాజన్‌కు ఫిర్యాదు చేశారు. పుదుచ్చేరి వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని జీజీహెచ్‌లో అంబులెన్స్ డ్రైవర్లుగా పనిచేస్తున్నామని, కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి, సేవలు అందించినా తమను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం జీతాలు ఇప్పించాలని కోరారు.

ఆ జీవోను రద్దు చేయాలి

అమలాపురం టౌన్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్-1 ని రద్దు చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వై.రాజేష్ అమలాపురంలో శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వాక్ స్వాతంత్రం, అభిప్రాయాల స్వేచ్ఛగా వ్యక్తీకరించే హక్కు, సమావేశాలు జరుపుకొనే హక్కులను ఈ జీవో హరిస్తోందని వారు అభిప్రాయపడ్డారు.

వైభవంగా చొల్లంగి తీర్థం


సంగమేశ్వరుని ఆలయంలో క్యూలైన్లను పరిశీలిస్తున్న దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ విజయరామరాజు


వీరభద్రులను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు


కోలాహలంగా అప్పన్నెద్దులను తీసుకువస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో చొల్లంగి సంగమేశ్వర స్వామి

- సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తులు
- ఘనంగా వీరభద్రుని సంబరాలు
- ఆకట్టుకున్న అప్పన్నెద్దులు

తాళ్లరేవు: చొల్లంగి అమావాస్య పర్వదినం సందర్భంగా తీర్థమహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. చొల్లంగిలోని చంద్ర ప్రతిష్టత లింగమైన రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి, తుల్యభాగ నదీతీరాన ఉన్న బాలాత్రిపురసుందరీ సమేత సంగమేశ్వర స్వామివార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులతో చొల్లంగి జనసంద్రంగా మారింది. తెల్లవారు జామున 2 గంటల నుంచే భక్తులు పవిత్ర తుల్యభాగ నదిలో స్నానమాచరించి, పరమేశ్వరుని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. పలు చోట్ల అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయాన్ని దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఎం.విజయరామరాజు, అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సౌజన్య, కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ తదితరులు సందర్శించారు. సోమేశ్వరస్వామి వారికి ఆలయ అర్చకులు వెలువలపల్లి భవానీ శంకర్‌శర్మ, సత్య చిరంజీవి నేతృత్వంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. సంగమేశ్వర స్వామిని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ దర్శించుకున్నారు.

వీరభద్రులు, అమ్మవార్ల ఊరేగింపు

పలు గ్రామాల్లో అమ్మవార్లను, వీరభద్రులను ఊరేగింపుగా తీసుకు వెళ్లి పవిత్ర స్నానాలు చేయించారు. ప్రధానంగా మట్లపాలెం గ్రామ దేవత మహాలక్ష్మి అమ్మవారిని, వీరభద్రులను గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. తీర్థానికి తరలివచ్చిన జంగమదేవరులు, గరగ నృత్యాలు, వీరభద్రుని సంబరాలు, పూనకాలతో ఆ ప్రాంతం సందడిగా మారింది. తీర్థానికి వచ్చిన మహిళలు గృహయోగం కలగాలని ఆలయ ప్రాంగణంలోని ఒక చెట్టు వద్ద రాళ్లను ఒకదానిపై ఒకటి పేర్చి మొక్కుకున్నారు.

కోలాహలంగా అప్పన్నెద్దుల ఊరేగింపు

చొల్లంగి అమావాస్య పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేవి అప్పన్నెద్దులు. వేంకటేశ్వర స్వామివారి ప్రతిరూపాలుగా భావించే అప్పన్నెద్దులను మండలంలోని పలు గ్రామాల నుంచి యువకులు ఉత్సాహంగా తీర్థానికి తీసుకువచ్చి పవిత్ర తుల్యభాగ నదిలో స్నానాలు చేయించారు. అనంతరం స్వామివార్ల దర్శనానికి తీసుకువచ్చారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన ఈ అప్పన్నెద్దులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా యాదవ సోదరులు భజనలు చేస్తూ అప్పన్నెద్దుల వెంట ఉత్సాహంగా పరుగులు తీశారు. ఉప్పలంక మొండి నుంచి చొల్లంగి గ్రామంలోని సోమేశ్వరస్వామివారి ఆలయానికి చేరుకుని కోల సంబరాలు నిర్వహించారు.

ట్రాఫిక్ మళ్లింపు

తీర్థానికి అశేష భక్తజనం తరలిరావడంతో కాకినాడ-యానాం జాతీయ రహదారిలో ట్రాఫిక్‌ను మళ్లించారు. అమలాపురం నుంచి యానాం మీదుగా వచ్చే భారీ వాహనాలను జాంకాయల తూము సెంటర్ నుంచి జి.వేమవరం మీదుగా కాజులూరు రహదారికి మళ్లించారు. ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతించారు. దీంతో భారీ వాహనాలపై వచ్చినవారు కొంతమేర అసౌకర్యానికి గురయ్యారు. కాగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కోరంగి, కరప పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సముద్ర స్నానాలు


సముద్రంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

అల్లవరం: చొల్లంగి అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని సామంతకుర్రు శివారు ఎస్.రామేశ్వరంలోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామిని భక్తులు శనివారం దర్శించుకున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచి కోనసీమ జిల్లాలో పలు మండలాల నుంచి తరలివచ్చిన భక్తులు ఎస్.రామేశ్వరంలోని సముద్రంలో పుణ్య స్నానాలు ఆచరించి, స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీరంలో కొలువైన స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో స్వామివారి దర్శనానికి ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద భారీ తీర్థ మహోత్సవం నిర్వహించారు. సముద్ర స్నానాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అల్లవరం పోలీసులు, మెరైన్ పోలీసులు ప్రత్యేక భద్రత కల్పించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్


ఉప్పంగలలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం ఉప్పంగల పంచాయతీలో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఎంపీపీ రాయుడు సునీత, స్థానిక సర్పంచ్ శాఖా శంకరుడు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ దవులూరి శ్రీరామ్మూర్తి తదితరులతో కలిసి ఎమ్మెల్యే పొన్నాడ ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే గత మూడున్నరేళ్లలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. పలు చోట్ల మహిళలు ఎమ్మెల్యే పొన్నాడకు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. నియోజకవర్గంలో రాబోయే 25 ఏళ్ల వరకూ తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టినట్టు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ తెలిపారు. ఉప్పంగల పంచాయతీ బాబానగర్‌లో తాగునీటి సమస్య నివారణ కోసం ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.29.40 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

నేడు రామ్ మాధవ్ రాక

అమలాపురం రూరల్: బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ఎస్ నేత వారణాసి రామ్‌మాధవ్ ఆదివారం అమలాపురంలో పర్యటిస్తారు. సీవీ రామన్ స్కూల్ ఆవరణలో ఉదయం 7 గంటలకు కోనసీమ జిల్లా ఆర్ఎస్ఎస్ సదస్సులో ప్రసంగించనున్నారు.

కోరంగి పరీక్షా కేంద్రం సిద్ధం

తాళ్లరేవు: పోలీస్ కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షకు సంబంధించి కోరంగి కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్టు కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. కళాశాలలో రెండు పరీక్షా కేంద్రాల్లో రెండు వేల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్టు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష సమయానికి గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని కోరారు. జేఎన్‌టీయూకే ఎగ్జామినేషన్ సెల్ బృందం పరీక్షలను పర్యవేక్షిస్తారని, తాము బందోబస్తు నిర్వహిస్తామని తెలిపారు.

ఇన్విజిలేటర్లకు సూచనలు

అమలాపురం రూరల్: ఎస్‌బీఆర్ కళాశాలలో ఆదివారం నిర్వహించే పోలీసు కానిస్టేబుళ్ల రాత పరీక్ష సంబంధించిన ఇన్విజిలేటర్లకు ఎస్‌కేబీఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ కుమార్ శాస్త్రి పలు సూచనలు చేశారు.

స్టడీ మెటీరియల్ అందజేత

అల్లవరం: పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన స్టడీ మెటీరియల్‌ను జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారని ఎంపీడీఓ జి.సరోవరరావు శనివారం తెలిపారు. ఈ నెల 23న అల్లవరం, గోడిలంక, తూర్పులంక, కొమరగిరిపట్నం, ఓడలరేవు ఉన్నత పాఠశాలల్లో అందజేస్తారన్నారు. 24న బోడసకుర్రు, కోడూరుపాడు, దేవగుప్తం, సామంతకుర్రు పాఠశాలలు, 25న గోడి బాలురు, బాలికల గురుకుల పాఠశాలల్లో స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తారని తెలిపారు.

బస్టాండ్ ఖాళీ స్థలం లీజుకు టెండర్లు

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లాలోని అంబాజీపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని 2370 గజాలు(0.5 6ఏ కాలు ఖాళీ స్థలాన్ని 15 ఏళ్ల కాలానికి లీజ్‌కు ఇచ్చేందుకు టెండర్లు పిలుస్తున్నట్టు అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి తెలిపారు. టెండర్ ఫారాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఏపీఎస్ఆర్టీసీ డాట్ ఏపీ డాట్‌జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఈ నెల 31 సాయంత్రం 5 గంటల వరకూ చివరి తేదీ ఉందని, డౌన్లోడ్ అనంతరం పూర్తి చేసిన అప్లికేషన్ విజయవాడ జోన్-2 ఈడీ కార్యాలయంలో వచ్చే నెల ఒకటో తేదీ లోపు అందించాలన్నారు. బిడ్స్ ఆదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఓపెన్ చేస్తారన్నారు.

ప్రజా ధనం దుర్వినియోగం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో మున్సిపాలిటీ, ఆరోగ్య, కోపరేటివ్, పాసిక్ తదితర శాఖల ఉద్యోగులకు నెలల తరబడి జీతాల్లేక ఇబ్బంది పడుతుంటే లక్షలాది రూపాయిల ఖర్చుతో ఫ్లవర్ షో నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం తగదని స్థానిక సామాజిక కార్యకర్తలు పెసల వెంకటేష్, తుమ్మలపల్లి హరి, కాదా పవన్‌ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో 10 నెలలుగా జీతాలు లేవని, వైద్య, ఆరోగ్య శాఖల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి 23 నెలల నుంచి జీతాలు లేవని వాటిని మంజూరు చేయాలంటూ ఆందోళనలు చేస్తుంటే వాటిని పరిష్కరించకుండా, ఫ్లవర్‌షోకు రూ.24లక్షలు నిధులు మంజూరు చేయడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని ఈ ఘటనపై ఎల్జీ తమిళిసైసౌందరరాజన్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.